సాక్షి వనపర్తి

గురువారం ၊ 13 ၊ జూలై ၊ 2023



100 రోజుల ప్రణాళిక..

ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు యాజమాన్యం కార్యక్రమాలు రూపొందించింది.

వివరాలు 8లో ▸



కొలువులొచ్చేనా..!

శ్రీశైలం నిర్వాసితులకు నాలుగు దశాబ్దాలు గడిచినా పూర్తిస్థాయిలో ఉద్యోగాలు ఇవ్వలేదు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /23.9

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అప్పుడప్పుడు ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యారంగంపై ప్రభుత్వ వైఖరి మారాలి



వనపర్తిటౌన్: విద్యారంగంపై బీఆర్ఎస్ ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు గణేష్ కోరారు. బుధవారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త బంద్‌లో భాగంగా జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహించి ఇందిరాపార్క్ దగ్గర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, రెండు జతల యూనిఫామ్స్ అందించాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక, బోధనేతర సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని, మన ఊరు–మన బడిలో అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, స్కావెంజర్లను నియమించాలని, కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రూ.5,177 కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు యుగంధర్, అశోక్, జేమ్స్, జయంత్, రంజిత్, వంశి, కొమ్ము హేమచందర్, వెంకటేష్, భాను ప్రకాశ్, వినయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,018 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం పూర్తిస్థాయి నీటి మట్టం 1,018 అడుగులు ఉందని ఏఈ సింగిరెడ్డి రసీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వకు సరఫరా నిలిపివేశారు. తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు వివరించారు.

దుష్ప్రచారాలు సరికాదు : కాంగ్రెస్

కొత్తకోట రూరల్: కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ ఇవ్వదని బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేయడం సరికాదని డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. టీపీసీసీ పిలుపు మేరకు బుధవారం కొత్తకోట మండలం కానాయపల్లి శివారులో ఉన్న సబ్‌స్టేషన్ ఎదుట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌పార్టీకే దక్కిందన్నారు. సన్నకారు రైతుల గురించి రేవంత్‌రెడ్డి మాట్లాడితే సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు తప్పుగా వక్రీకరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 95 శాతం మంది రైతులకు 3 ఎకరాలలోపు భూమి మాత్రమే ఉందని.. ఎకరాకు నీరు అందించాలంటే గంట కరెంట్ చాలని, 3 ఎకరాలకు 3 గంటల విద్యుత్ ఇస్తే చాలు అని రేవంత్‌రెడ్డి అంటే దానిని వక్రీకరిస్తూ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని, ఉచిత విద్యుత్ రద్దు చేయాలని మాట్లాడలేదన్నారు. మాయమాటలతో గద్దెనెక్కిన సీఎం కేసీఆర్‌కు ప్రజలు, రైతులు బుద్ధి చెప్పేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధానకార్యదర్శి బోయేజ్, కౌన్సిలర్ నాగన్నసాగర్, గొల్లబాబు, బీచుపల్లియాదవ్, లక్ష్మయ్యయాదవ్, ముజీబ్, నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నాగేంద్రబాబు, బీరన్న, రాములు, లోకేష్, నరేంద్రగౌడ్, శ్రీకాంత్, ప్రతాప్, కార్తీక్, నవీన్, దిలీప్‌రెడ్డి, పవన్, నాని, రాఘవ పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్లపై నిఘా!

వనపర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జోరుగా అక్రమ రిజిస్ట్రేషన్లు



జిల్లాకేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- స్టాంప్స్, రిజిస్ట్రేషన్లశాఖ ఐజీ, సీఎస్, మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదులు
- ఏసీబీ నిఘా?

వనపర్తి: జిల్లాకేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న రిజిస్ట్రేషన్లపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందటం.. ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించినట్లు వార్తలు గుప్పుమంటుండటంతో ఏసీబీ అధికారులు సైతం దృష్టి సారించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. 2020, ఆగస్టు 20కి ముందు వరకు డాక్యుమెంట్లు ఉన్న ప్లాట్లను మాత్రమే రిజిస్ట్రేషన్ చేయవచ్చు. ఆ తర్వాత ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వెంచర్లలోని ప్లాట్లు, రికార్డులో భూమిగా ఉన్న ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయరాదని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. కానీ అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేస్తూ రూ.వేలు దండుకుంటున్నట్లు వనపర్తి సబ్ రిజిస్ట్రార్‌తో పాటు కార్యాలయ సిబ్బందిపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతకాలంగా వనపర్తి, పెబ్బేరు ప్రాంతాలకు చెందిన కొందరు మధ్యవర్తులు ఈ దందాకు తెరతీసినట్లు తెలుస్తోంది. ఎలాంటి అనుమతి లేకుండా భూమిని వెంచర్‌గా మార్చిన ప్లాట్లను సైతం రిజిస్ట్రేషన్లు చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు.

ఇవీ నిబంధనలు..

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. డీటీసీపీ లేఅవుట్‌లోని ప్లాట్లు అయి ఉండాలి. ఒకవేళ పాత వెంచరై ఉంటే.. 2020, ఆగస్టు 20కి ముందు ఒకసారి హక్కు మార్పిడి (సేల్‌డీడ్), ఆస్తి బహుమతి (గిఫ్ట్ డీడ్) చేసి ఉండాలి. నిర్ణీత గడువుకు ముందు జీపీఏ (జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) డాక్యుమెంట్ చేసి ఉంటే ఆ ప్లాట్లను సైతం రిజిస్ట్రేషన్ చేయటం నిషేధం.

వెల్లువెత్తిన ఫిర్యాదులు..

జిల్లాకేంద్రంతో పాటు పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని చెలిమిల్ల ప్రాంతానికి చెందిన పలువురు ఈ విషయంపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లశాఖ ఐజీ, సీఎస్ శాంతకుమారికి, ట్విట్టర్‌లో కేటీఆర్‌తో పాటు పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. పక్కా ఆధారాలతో ఫిర్యాదులు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి విచారణ చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఒక్కో ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు రూ.వేలల్లో..

అక్రమ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కుగాను డాక్యుమెంట్ రైటర్, మధ్యవర్తిని బట్టి రేటు నిర్ణయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మొదట్లో మానవతా దృక్పథంతో కోర్టు ఆదేశాల మేరకు ఆడపిల్లల పెళ్లి, పిల్లల చదువుల పేరిట ప్రారంభమైన ఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ.. ఇప్పుడు ఒక దందాగా మారిందనే విమర్శలు గుప్పుమంటున్నాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులు సైతం దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్లు..

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. కొందరు ఉద్దేశపూర్వకంగా ఫిర్యాదులు చేస్తున్నారు. ఈరోజే కలెక్టర్ కార్యాలయం నుంచి కొన్ని అంశాలపై వివరణ కోరుతూ లేఖ వచ్చింది. గడువులోగా సమాధానమిస్తాం. ఫిర్యాదులు చేస్తే.. శాఖాపరమైన విచారణ ఇదివరకే ప్రారంభమయ్యేది. ఏసీబీ నిఘా అనే విషయం నా దృష్టికి రాలేదు. గతంలోనూ మా కార్యాలయానికి వచ్చినట్లు నాకు తెలియదు.

– క్రిష్టఫర్, సబ్ రిజిస్ట్రార్, వనపర్తి

ఏసీబీ నజర్?

పలువురి ఫిర్యాదుల మేరకు రెండునెలల కిందట ఏసీబీ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచగా.. దీనిని పసిగట్టిన కార్యాలయంలోని అవినీతి అధికారులు త్రుటిలో తప్పించుకున్నట్లు ప్రచారంలో ఉంది. ఉమ్మడి జిల్లాతో పాటు దక్షిణ తెలంగాణలోనే అత్యధిక రిజిస్ట్రేషన్లు అయ్యే మొదటి అయిదు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వనపర్తి ఒకటిగా చెప్పవచ్చు.

పోడుపట్టాల పంపిణీ సాహసోపేత నిర్ణయం



పోడు రైతులకు పట్టాలు అందజేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, చిత్రంలో జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి తదితరులు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: రాష్ట్రవ్యాప్తంగా 4.35 లక్షల ఎకరాల పోడు భూములను ఏళ్లుగా సాగుచేసుకుంటున్న రైతులకు హక్కు కల్పించటం సీఎం కేసీఆర్ సాహసోపేత నిర్ణయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని పోడు రైతులకు హక్కు పత్రాలను (పట్టాలు) జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పోడు పట్టాల పంపిణీ దేశ చరిత్రలో రికార్డుగా పేర్కొనాలన్నారు. గిరిజనులు దశాబ్దాలుగా పోడు భూమిని సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని గుర్తించి ఆ భూమిపై హక్కు కల్పించటంతో పాటు రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలను వర్తింపజేయడం హర్షణీయమని.. ఇలాంటి నిర్ణయం భవిష్యత్‌లోనూ ఎవరూ తీసుకోలేరని తెలిపారు. అటవీ శాతం పెంచేందుకు హరితహారం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తోందని.. ఇకపై గిరిజనులు ఎవరూ చెట్లు నరికి అటవీ భూముల్లో పంటలు సాగు చేయరాదని హామీపత్రం తీసుకోవటంతో పాటు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎక్కడైనా అర్హులకు పట్టాలు రాకపోతే మరోమారు సర్వే చేయిస్తామని.. అర్హులందరికీ పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పట్టాలు పొందిన రైతులు ఎకరాకు 15 మొక్కల చొప్పున నాటి పెంచాలని సూచించారు. మొక్కలు పెంచితేనే జీవకోటి మనుగడ సాధ్యమని తెలిపారు.

ఏళ్లనాటి కల నెరవేరింది..

దశాబ్దాలుగా ఉన్న పోడు భూముల హక్కు సమస్య పట్టాల పంపిణీతో పరిష్కారమైందని జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఇక నుంచి సాధారణ రైతులతో సమానంగా సంక్షేమ పథకాలు వర్తిస్తాయని.. వడ్డీ వ్యాపారం చేసే దళారుల చేతుల్లో మోసపోవద్దని సూచించారు. ఎవరైనా వాణిజ్య పంటలు సాగుచేస్తే బ్యాంకుల ద్వారా రాయితీ రుణాలు సైతం పొందవచ్చన్నారు.

పక్కా సర్వే తర్వాతే పట్టాల పంపిణీ..

వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆధునిక పద్ధతిలో సర్వే చేసి పోడు రైతుల ఎంపిక చేసినట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. జిల్లాలో ఏళ్లుగా పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజన రైతులను క్షేత్రస్థాయిలో గ్రామస్థాయి, మండలస్థాయి కమిటీలు పరిశీలన చేసి సిఫారస్ చేసిన పేర్లను జిల్లాస్థాయి కమిటీతో 415 మందిని గుర్తించి 481 ఎకరాల భూమిపై హక్కు కల్పిస్తూ పట్టాలు తయారు చేసినట్లు వెల్లడించారు. పోడు పట్టాలు జారీ చేయడంలో సహకరించిన మంత్రి, అటవీశాఖ సిబ్బంది, గిరిజన అభివృద్ధిశాఖ సిబ్బంది, కమిటీ సభ్యులకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ నవీన్‌రెడ్డి, డీటీడీఓ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, ఖిల్లాఘణపురం ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, ఎంపీటీసీ సభ్యుడు ధర్మానాయక్, సర్పంచ్ పీన్యానాయక్, నాయకులు జాత్రునాయక్ , పోడు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకే పరిశ్రమల ఏర్పాటు

- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మదనాపురం: నియోజకవర్గంలోని యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని మంత్రి కేటీఆర్‌ను వేముల పర్యటనలో కోరడంతో సానుకూలంగా స్పందించి వెంటనే టెక్స్‌టైల్స్ బృందాన్ని పంపించారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని దుప్పల్లి, కొన్నూరు గ్రామాల మధ్య దాదాపు 250 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటుకుగాను అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసాపేట మండలంతో పాటు భూత్పూరు మండలం కర్వెన దగ్గర స్థలాన్ని పరిశీలించామని పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ఈ ప్రాంత యువత తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ టెక్స్‌టైల్స్ మెహర్ పరేక్, కిటెక్స్ ప్రతినిధులు మనోజ్, జేసీ వేణుగోపాల్, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణయ్య, మార్కెట్ చైర్మన్ శ్రావణ్‌రెడ్డి, ఎంపీపీ భర్త వెంకటనారాయణ, తహసీల్దార్ నరేందర్, సర్పంచ్ శివకుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



దుప్పల్లి-కొన్నూరు మధ్య స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ప్రతినిధులు

కాంగ్రెస్ నేతల పహారా

- రహదారి విస్తరణలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పక్కకు జరుపుతారనే ప్రచారం
- అర్ధరాత్రి వరకు మాజీమంత్రి కాపలా

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలో కొనసాగుతున్న రహదారి విస్తరణలో రాజీవ్‌చౌక్‌లో ఉన్న దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పక్కకు జరుపుతారనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి పది నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు మాజీ మంత్రి డా. చిన్నారెడ్డి పార్టీ నేతలతో కలిసి రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఉన్నారు. విగ్రహాన్ని తొలగించేందుకు రావద్దని యంత్రాల డ్రైవర్లను హెచ్చరించారు. మంగళవారం అర్ధరాత్రి సైతం కాంగ్రెస్ నాయకులు పహారా కాశారు. అన్ని విగ్రహాలను పక్కకు తొలగించినట్లుగానే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని జరిపి తీరుతామని అధికార పార్టీ నేతలు ప్రకటించినట్లు ప్రచారం జరుగుతుండటంతో రోజురోజుకు ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం రాజీవ్‌గాంధీ విగ్రహ పరిసరాల్లోనే ఆర్ అండ్‌బీ అధికారులు మెటల్ రోడ్డు పనులు చేపడుతున్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- జిల్లా విద్యాధికారి గోవిందరాజులు



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ గోవిందరాజులు

కొత్తకోట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా విద్యాధికారి గోవిందరాజులు అన్నారు. బుధవారం మధ్యాహ్నం పెద్దమందడి మండలం బలిజపల్లి-జంగమాయపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొనసాగుతున్న మన ఊరు–మన బడి పనులను పరిశీలించడంతో పాటు 10వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యతగా అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి ఈ ఏడాది పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, 10 జీపీఏ రావడానికి కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. డీఈఓ వెంట హెచ్‌ఎం, ఇన్‌చార్జ్ ఎంఈఓ జయశంకర్ ఉన్నారు.

విషయ పరిజ్ఞానం పెంపొందించాలి..

ఖిల్లాఘనపురం: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ధారాళంగా చదవడం, రాయడంతో పాటు విషయ పరిజ్ఞానం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి డా. గోవిందరాజులు అన్నారు. బుధవారం మండలంలోని ఖిల్లాఘనపురం, సోళీపురం, ముందలితండాలో పర్యటించిన ఆయన పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, పరిసరాలు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి నిత్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విధులను నిర్లక్ష్యం చేయకుండా విద్యార్థులను సొంత పిల్లలుగా చూసుకుంటూ నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకే మన ఊరు – మన బడి పథకం కింద అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థులకు అందించే ఆహారంలో ఎక్కడ నాణ్యత తగ్గరాదని.. మెనూ విధిగా పాటించాలని సూచించారు.

వాల్‌పోస్టర్ల విడుదల

వనపర్తి: జిల్లాకేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ ఆవరణలో బుధవారం టీఎన్‌జీఓ నాయకులు పాత పింఛన్ సాధన సంకల్పయాత్ర వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. జూలై 16న జిల్లాకేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్, కార్యదర్శి రాజు తెలిపారు. ఈ రథయాత్ర 33 జిల్లాల్లో పర్యటిస్తుందన్నారు. కార్యక్రమంలో మినిస్ట్రీయల్ సంఘం జిల్లా అధ్యక్షుడు భాను, రాష్ట్ర రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి తిలక్ తదితరులు పాల్గొన్నారు.



వేగంగా రహదారి విస్తరణ పనులు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

వనపర్తిటౌన్: రహదారి విస్తరణకు అవసరమైన ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు ముందస్తుగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. బుధవారం ఉదయం జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం నుంచి రామా థియేటర్ వరకు విద్యుత్ స్తంభాల మార్పిడి, డ్రెయినేజీ వ్యవస్థను పురపాలిక, విద్యుత్, రహదారులు, భవనాలశాఖ అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించారు. భవనం శిథిలావస్థకు చేరుకుందని.. నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా ఉర్దూ మీడియం పాఠశాలను సైతం పరిశీలించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వేణుగోపాల్, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, పుర కమిషనర్ విక్రమసింహారెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ఈ నాగేందర్, ఆర్అండ్‌బీ డీఈ దానయ్య, తహసీల్దార్ రాజేందర్‌గౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

అదునులోనే పంటల సాగు

- జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి

అమరచింత: వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు పంటలు సాగుచేసుకోవాలని.. అప్పుడే ఆశించిన దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పాంరెడ్డిపల్లి, నాగల్‌కడ్మూర్‌లో ఆయన పర్యటించి ఆయా గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించి మాట్లాడారు. తేలికపాటి నేలలో 50 నుంచి 60 మిల్లీమీటర్లు, బరువు నేలలో 60 నుంచి 75 మి.మీ. వర్షపాతం నమోదైన తరువాతే విత్తనాలు విత్తాలని సూచించారు. 15 నుంచి 20 సెంటీమీటర్ల మేర వర్షం కురిసిన తర్వాత వర్షాధార పంటలైన పత్తి, కంది, మొక్కజొన్న, పెసర తదితర పంటలు సాగు చేయాలన్నారు. వరిలో స్వల్పకాలిక రకాలు ఆర్ఎన్ఆర్–15048 నారు పోసుకోవచ్చని.. కంది, పత్తి విత్తనాలు జూలై 15 వరకు విత్తుకోవచ్చని తెలిపారు. పత్తి మొక్కలు ఎర్రబడితే మెగ్నీషియం సల్ఫేట్ పిచికారీ చేయాలన్నారు. జూన్ 18 వరకు పట్టాదారు పాసుబుక్ వచ్చిన రైతులు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రైతులు తొందరపడి విత్తనాలు విత్తి నష్టపోరాదన్నారు. ఆయన వెంట ఏఓ వినయ్, ఏఈఓ హరిత, రైతులు ఉన్నారు.



ధర్మాపురం శివారులో పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్

వనపర్తి: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని అమరచింతలో పది నెలలుగా 500 మంది పేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని.. అధికారులు పట్టాలివ్వాలన్నారు. పెబ్బేరు మండలం కంచిరావుపల్లి, ఆత్మకూరు, కొత్తకోట, కేతేపల్లి, వెల్గొండ, వెల్టూర్‌లో పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చినా హద్దులు చూపించలేదని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యవర్గసభ్యులు పి.ఆంజనేయులు, నాయకులు బాల్‌రెడ్డి, జీఎస్ గోపి, లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు దేవేందర్, రాజు, ఆర్ఎన్ రమేష్, మండ్ల కృష్ణయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్

పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించాలి

పాన్‌గల్: గ్రామపంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించడంతో పాటు డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపడుతున్న నిరవధిక సమ్మెకు సీపీఎం తరపున సంపూర్ణ మద్దతు తెలిపి మాట్లాడారు. డిమాండ్ల సాధనకు కార్మికులు 7 రోజులుగా సమ్మె చేపడుతున్నా.. ప్రభుత్వం ఏ మాత్రం స్పందించకుండా మొండి వైఖరి ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. ప్రత్యేక రాష్ట్రంలో సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశించిన కార్మికులకు నిరాశే మిగిలిందని.. అనేక శాఖల్లో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకపోవడం, కాంట్రాక్టు ఉద్యోగులతో ఎక్కువ వేతనానికి పని చేయించుకుంటున్నారని తెలిపారు. నెలలు గడుస్తున్నా కార్మికులకు వేతనాలు అందించకపోవడం ఏమిటని.. అధికారుల వేధింపులు సరికాదన్నారు. ఎనిమిది గంటల పనిదినాలను అమలు చేయాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. కార్మికులు బొడ్డెమ్మతో వినూత్నంగా నిరసన తెలిపారు. సీపీఎం నాయకులు దేవేందర్, బాల్యానాయక్, సీఐటీయూ నాయకుడు రాము, కార్మికులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ఓడించడమే లక్ష్యం

వనపర్తి: అవినీతిమయంగా మారిన బీఆర్ఎస్‌ను తెలంగాణలో, వనపర్తి నియోజకవర్గంలో ఓడించటమే లక్ష్యంగా పనిచేస్తామని పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి వెల్లడించారు. బుధవారం జిల్లాకేంద్రంలోని నందిహిల్స్‌లో ఉన్న తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడటం ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని.. సుదీర్ఘకాలం సన్నిహితులు, మిత్రులు, అనుచర నాయకత్వంతో చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు బాటలో నడుస్తూ.. ఈ నెల 20న కొల్లాపూర్‌లో జరిగే భారీ బహిరంగసభలో ప్రియాంకగాంధీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకుంటామని స్పష్టం చేశారు. సభకు నియోజకవర్గం నుంచి 35 వేల మందిని తరలించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందే మాజీ మంత్రి డా. జి.చిన్నారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలో చేరుతున్నట్లు చెబుతానన్నారు. వనపర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా మాట్లాడితే పోలీసు కేసులు నమోదు చేస్తున్నారని, ఇంకో మూడు నాలుగు నెలలు ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, ప్రభుత్వ అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించటం గౌరవప్రదంగా ఉంటుందని సూచించారు. అతి త్వరలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌పార్టీలోకి భారీగా వలసలు కొనసాగుతాయన్నారు. అవినీతి, మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను విస్మరించిన అంశాలను ప్రధాన అస్త్రాలుగా చేసుకొని బీఆర్ఎస్‌ను ఎదుర్కొంటామని వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బ్రహ్మంచారి, రాధాకృష్ణ, నాయకులు సత్యశీలారెడ్డి, సాయిచరణ్‌రెడ్డి, రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ మేఘారెడ్డి

క్లుప్తంగా

డీసీఎం, బైక్ ఢీకొని వ్యక్తి మృతి


కలాల్ శ్రీనివాస్‌గౌడ్ (ఫైల్)

హన్వాడ: మూల మలుపులో వేగంగా వస్తున్న డీసీఎంను ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం లింగన్నపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గొండ్యాల్ ఉప సర్పంచ్ అలివేల భర్త కలాల్ శ్రీనివాస్‌గౌడ్(45) బోనాల పండుగకొచ్చిన బంధువును బైక్‌పై కోయిల్‌కొండ మండలం మల్కాపూర్‌లో వదిలేందుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో లింగన్నపల్లి గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద కోయిల్‌కొండ వైపు వెళ్తున్న బాయిలర్ కోళ్ల డీసీఎం శ్రీనివాస్‌గౌడ్ బైక్‌ను ఢీకొట్టింది. వెంటనే డీసీఎం డ్రైవర్ పరారయ్యాడు. స్థానికులు గాయాలైన శ్రీనివాస్‌గౌడ్‌ను చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని నవోదయ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. అతనికి భార్య అలివేల, కొడుకు, కూతురు ఉన్నారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని హన్వాడ పోలీసులు తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

అచ్చంపేట: మండలంలోని చౌటపల్లికి చెందిన గంధం శ్రీను (48)బుధవారం పాముకాటుతో మృతి చెందాడు. వ్యవసాయ పొలంలో పాము కాటు వేయగా కుటుంబసభ్యులు పట్టణ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందించే లోపే మృతి చెందినట్లు భార్య రామేశ్వరమ్మ తెలిపారు. మృతునికి కుమారుడు ఉన్నాడు.

మృతురాలి వివరాలు లభ్యం


గంగమ్మ (ఫైల్)

నవాబుపేట: షాద్‌నగర్ పట్టణ పరిసరాల్లో మంగళవారం లభించిన మహిళ మృతదేహం మండలంలోని బంగ్రంపల్లి చెందిన ధోరమోని గంగమ్మ(39)గా తేలింది. మృతురాలు తన భర్తతో కలిసి షాద్‌నగర్‌లో పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆమెకు కల్లు తాగే అలవాటు ఉండటంతో అదే ఆమె హత్యకు కారణంగా మారింది. కల్లు తాగేందుకు వెళ్లిన ఆమెను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కల్లు తాగించి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి హత్య చేసి నగలు ఎత్తుకెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మూడు రోజులుగా జాడ లేకపోవటంతో ఆమె కోసం వెతికిన భర్తకు గుర్తు తెలియని మహిళ శవం షాద్‌నగర్ సమీపంలో ఉందని సమాచారం రావటంతో అక్కడికి వెళ్లి తన భార్యదే శవం అని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం అనంతరం బుధవారం మండలంలోని బంగ్రంపల్లిలో ఆమె అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతురాలి ఒంటిపై దాదాపుగా 20 తులాలకు పైగా వెండి, అరతులం బంగారు ఆభరణాలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బావిలో పడి మహిళ మృతి

అచ్చంపేట: పట్టణంలోని మల్లంకుంట సమీపంలోని వ్యవసాయబావిలో ఓ మహిళ పడి మృతి సంఘటన బుధవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ గోవర్ధన్ కథనం ప్రకారం.. పదర మండలం ఉడిమిళ్ల గ్రామానికి చెందిన శైలజ(35) కొంత కాలంగా పట్టణంలోని సాయినగర్ కాలనీలో నివాసం ఉంటుంది. బుధవారం బావిలో శవమై కనిపించడంతో ఆ ప్రాంతవాసులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనాస్థలానికి చేరుకున్న వారు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శైలజ భర్త గతంలోనే చనిపోగా.. ఆమెకు ఒక కుమారుడు ఉన్నారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంటుందని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఆలయంలో చోరీ



రాజోళి: మండలంలోని చిన్నదన్వాడ గ్రామంలోని మారెమ్మ ఆలయంలో గుర్తు తెలియని దుండగులు హుండీ ధ్వంసం చేసి రూ.10వేలు చోరీ చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామంలోని మారెమ్మ ఆలయంలోని ఉత్తర ద్వారం వైపు ఉన్న హుండీని దుండగులు ధ్వంసం చేసి అందులో ఉన్న రూ.10వేల నగదును అపహరించారు. రోజు లాగానే గుడికి పూజలు చేసేందుకు పూజారి వచ్చి చూడగా హుండీ కనిపించలేదు. గుడిలో ఉండాల్సిన హుండీ పక్కనే ఉన్న నదిఒడ్డున కనిపించింది. వెంటనే గ్రామస్తులతో వెళ్లి పోలీసులకు సమాచారమిచ్చారు. సీసీ కెమెరాను సైతం దుండగులు ధ్వంసం చేసినట్లు తెలిపారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఎంఏ ఖాదర్ భాషా తెలిపారు.

వందరోజుల ప్రణాళిక సక్సెస్

- రీజియన్‌కు మెరుగైన ఫలితాలు
- ఈఏడాది రూ.16.94 కోట్ల అధిక ఆదాయం
- ఈపీకే 42.63, ఆక్యుపెన్సి రేషియో 72శాతం
- పలు విభాగాల్లో లక్ష్యాన్ని దాటిన మహబూబ్‌నగర్ రీజియన్


బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ సంస్థను గాడిలో పెట్టడానికి యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. వివిధ ప్రత్యేక రోజుల్లో రాయితీలు ప్రకటిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 23వ తేదీ నుంచి జూన్ 30 వరకు ఆర్టీసీ వందరోజుల ప్రణాళిక ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. గత ఏడాది నుంచి వందరోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఈ వందరోజుల్లో లక్ష్యాన్ని ఏర్పరుచుకొని అన్ని రూట్లలో బస్సులను నడిపించి ప్రయాణికులకు సేవలు అందించారు. ప్రతి స్టాప్ వద్ద కనీసం ముగ్గురు నుంచి నలుగురు అదనంగా ప్రయాణికులను ఎక్కించుకున్నారు. దీంతో ఈఏడాది కూడా మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌కు మెరుగైన ఫలితాలు వచ్చాయి.

అధిక ఆదాయం...

వంద రోజుల ప్రణాళికలో మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించింది. గత ఏడాది కంటే ఈ ఏడాది మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ రూ.16 కోట్ల 94లక్షల 91వేల అధిక ఆదాయాన్ని పొందడం విశేషం. గత ఏడాది మహబూబ్‌నగర్ రీజియన్ రూ.119 కోట్ల 93లక్షల 73వేల ఆదాయం సాధించగా, ఈ ఏడాది 136 కోట్ల 88 లక్షల 65వేల ఆదాయాన్ని పొందింది. ఆదాయంలో లక్ష్యం కంటే 114శాతం సాధించింది. రీజియన్ ఈపీకేలో గత ఏడాది 37.23 శాతం ఉండగా ఈ ఏడాది 42.63శాతం, ఆక్యుపెన్సి రేషియాలో గత ఏడాది 71.37 శాతం, ఈ ఏడాది 72 శాతం సాధించింది. రీజియన్‌లోని 842 బస్సులు 3లక్షల 21కిలోమీటర్లు తిరిగాయి. ఈపీకేలో వనపర్తి 38.42, అచ్చంపేట 37.56, మహబూబ్‌నగర్ డిపో 37.52 సాధించాయి.

డిపోల వారీగా ప్రణాళిక...

రీజియన్‌లోని అన్ని డిపోలు గత ఏడాది కంటే ఈ ఏడాది వంద రోజుల ప్రణాళికలో అధికంగా ఆదాయాన్ని పొందాయి. మహబూబ్‌నగర్ డిపో రూ.20కోట్ల 74లక్షల 36వేలు, వనపర్తి రూ.18కోట్ల 78లక్షల 74వేలు, గద్వాల రూ.15కోట్ల 84లక్షల 22వేలు, కల్వకుర్తి రూ.15కోట్ల 71లక్షల 76వేలు, నారాయణపేట రూ.14కోట్ల 84లక్షల 98వేలు, అచ్చంపేట రూ.13కోట్ల 97లక్షల 58వేలు, షాద్‌నగర్ రూ.13కోట్ల 46లక్షల 50వేలు, నాగర్‌కర్నూల్ రూ.12కోట్ల 63లక్షల 6వేలు, కొల్లాపూర్ రూ.9కోట్ల 57లక్షల 5వేలు, కోస్గి రూ.కోటి 30లక్షల 39వేల ఆదాయాన్ని పొందాయి.

ఉద్యోగుల కృషితోనే..



రీజియన్‌లోని పది డిపోల అన్ని స్థాయిల ఉద్యోగుల కృషితో వంద రోజుల ప్రణాళికలో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించాం. గత ఏడాది కంటే ఈ ఏడాది అధికంగా ఆదాయం రావడం సంతోషంగా ఉంది. ఇటీవలే పలు విభాగాల్లో రీజియన్‌లోని ఉద్యోగులు పురస్కారాలు పొందారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి భవిష్యత్తులో సంస్థను మరింత అభివృద్ధి దిశలో తీసుకువచ్చేలా పాటుపడుదాం.

– శ్రీదేవి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, మహబూబ్‌నగర్

నకిలీ బంగారం చూపించి మోసం

- రూ.3.20లక్షల నగదు, 1.5 తులాల బంగారంతో పరార్


నకిలీ బంగారు


బాధితుడు శంకర్

మిడ్జిల్: నకిలీ బంగారం ఆశ చూపి రూ.3.20 లక్షల నగదు, 1.5 తులాల బంగారంతో పరారైన ఘటన మిడ్జిల్ మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పట్నం శంకర్ వ్యవసాయం చేసుకుంటూ హోటల్ నడుపేవాడు. గ్రామంలో కేఎల్‌ఐ కాల్వ పనులు చేసేందుకు ఆంధ్రా నుంచి వెంకటేశ్వర్లు కుటుంబంతో వచ్చి మిడ్జిల్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. రోజూ శంకర్ హోటల్ వస్తుండడంతో అతనితో పరిచయం ఏర్పడింది. నమ్మకంగా ఉండడంతో వెంకటేశ్వర్లు తమ బంధువులతో బంగారం ఉందని, దాన్ని సగం ధరకే ఇస్తారని 20రోజులుగా శంకర్‌కు చెబుతున్నాడు. షాంపిల్‌గా బుధవారం కొంత బంగారం ఇచ్చి పరిశీలించుకోమని చెప్పాడు. అది అసలు బంగారం కావడంతో అతన్ని నమ్మి శంకర్ రూ.3.20 లక్షల నగదు, భార్య మెడలోని తులంనర బంగారు వస్తువును ఇచ్చాడు. ఇదే అదునుగా వెంకటేశ్వర్లు 20 తులాల బంగారం ఇచ్చాడు. రాత్రి శంకర్ ఇంటి పక్కనున్న బంగారం వ్యాపారి వద్దకు 20 తులాల తీసుకెళ్లి తూకం వేయించి పరిశీలించగా నకిలీదని తేలింది. వెంటనే వెంకటేశ్వర్లు అద్దెకున్న ఇంటికి వెళ్లగా తాళం వేసి ఉంది. అప్పటికే అతను కుటుంబంతో సహా పరారయ్యాడు. అతని ఫోన్ కూడా స్విచ్‌ఆఫ్ చేశాడు. మోసపోయాయనని తెలిసి శంకర్ పోలీసులను ఆశ్రయించాడు. ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అయ్యవారిపల్లిలో పట్టపగలే చోరీ


ధ్వంసమైన బీరువా

- 15 తులాల బంగారం, రూ.1.20లక్షల నగదు అపహరణ

మిడ్జిల్: ఇంటి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం వచ్చి చూసే సరికి బంగారు, నగదు చోరీ అయిన సంఘటన బుధవారం సాయంత్రం మండలంలోని అయ్యవారిపల్లిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గోల్ల శ్రీను, భార్య అనురాధ, తండ్రి కృష్ణయ్యతో కలిసి బుధవారం ఉదయం 10గంటలకు వ్యవసాయ పొలానికి వెళ్లారు. వారి ఇద్దరు పిల్లలను బడికి పంపించారు. సాయంత్రం ఇంటి వచ్చి చూసే సరికి బీరువా తాళం తీసి ఉండడంతో అనుమానం వచ్చి బీరువాలో ఉన్న బంగారు, నగదును చూడగా కన్పించలేదు. అందులో 15 తులాల బంగారు, రూ.1.20లక్షల నగదు ఉన్నట్లు వారు తెలిపారు. రాత్రి పోలిసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి ఎస్‌ఐ రామ్‌లాల్ నాయక్ చేరుకుని పరిశీలించారు.

బాలికల ఫుట్‌బాల్ జట్టుకు మూడో స్థానం


బాలికల జట్టుకు స్వాగతం పలికిన వార్డుకౌన్సిలర్లు, నాయకులు

జడ్చర్ల టౌన్: నిజామాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాలికల ఫుట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి జిల్లా బాలికల ఫుట్‌బాల్ జట్టు మూడో స్థానంలో నిలిచింది. బుధవారం జడ్చర్లకు చేరుకున్న ఉమ్మడిజిల్లా జట్టుకు రైల్వేస్టేషన్‌లో ఘన స్వాగతం పలికారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారిణులను, కోచ్‌ను ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రఘురాంగౌడ్, ఉమాశంకర్, ప్రశాంత్‌రెడ్డి, నందకిశోర్, రమేష్, పీఈటీ మోయిన్, ఉపాధ్యాయుడు కల్యాణ్ పాల్గొన్నారు.

నిలువురాళ్ల ప్రాంతం అప్పగించండి


ముడుమాల్ నిలువురాళ్ల ప్రాంతాన్ని సందర్శించిన డెక్కన్ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు

- డెక్కన్ హెరిటేజ్ అకాడమి సభ్యులు

కృష్ణా: మండలంలోని ముడుమాల్ గ్రామ సమీపంలో గల నిలువురాళ్ల ప్రాంతంను తమకు అప్పగించాలని డెక్కన్ హెరిటేజ్ అకాడమి చైర్మన్ వేదకుమార్ కోరారు. బుధవారం నిలువురాళ్ల ప్రాంతాన్ని హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిలువురాళ్ల ప్రాంతంలోని ప్రభుత్వ భూమిని సర్వే చేసి తమకు అప్పగించాలని, అదేవిధంగా సప్తర్షి మండలి ఉన్న ప్రాంతంలో ఫెన్సింగ్ చేసి ఇవ్వాలని కోరారు. త్వరలో ఈ నిలువురాళ్ల ప్రాంతానికి యునెస్కో గుర్తింపును తీసుకొచ్చేందుకు తాము ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలోనే వారు అడిగిన విధంగా డెక్కన్ హెరిటేజ్ వారికి అప్పగించడం జరుగుతుందని తహసీల్దార్ వైపీ రమేష్ తెలిపారు. ఇందులో ప్రొఫెసర్ పుల్లారావ్, డీటీ సురేష్, వీఆర్‌ఏ మహాదేవ్, గ్రామ నాయకులు ఉన్నారు.

శ్రీరామకొండపై చిరుత



కోయిల్‌కొండ: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన శ్రీరామకొండ క్షేత్రంలో బుధవారం దర్శనానికి వెళ్లిన భక్తులకు కొండపై చిరుతపులి పిల్ల తిరుగుతూ కనిపించింది. దీంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. శ్రీరామకొండపైకి భక్తులు ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలని నిర్వాహకులు తెలిపారు. పారెస్టు అధికారులు చిరుతపులి పిల్లను పట్టుకునేందుకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

అడ్డాకుల: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో ఇద్దరికి జిల్లా కోర్టు రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు మూసాపేట ఎస్‌ఐ విజయ భాస్కర్ తెలిపారు. భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన గొడుగు సురేష్, మూసాపేట మండలం మహ్మదుస్సేన్‌పల్లి గ్రామానికి చెందిన బాలయ్యలు ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుడ్డారు. వారిని బుధవారం జిల్లా కేంద్రంలోని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఇద్దరికి చెరో రెండురోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

మహిళ హత్య కేసులో ఇద్దరి రిమాండ్


మాట్లాడుతున్న సీఐ రాంలాల్

మక్తల్: నగల కోసం మహిళను హత్య చేసిన కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాంలాల్, ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు. బుధవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఈ నెల 8వ తేదీన పట్టణ సమీపంలోని కాటన్‌మిల్ వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించింది. సామాజిక మాధ్యమాల్లో, పత్రికల్లో సమాచారం రావడంతో మక్తల్‌కు చెందిన మృతురాలి భర్త భర్త లక్ష్మప్ప, పెద్దకూతురు అనిత, అల్లుడు రాములు పోలీసులను ఆశ్రయించారు. మృతురాలు కావాలి లక్ష్మి (48) తెలిపారు. హత్యపై విచారణ చేపట్టగా 4వ తేదీన పట్టణానికి చెందిన దూపం బుగ్గప్ప తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని వెళ్లినట్లు తేలింది. ఆమెను కాల్వ వద్దకు తీసుకెళ్లి మద్యం తాగించి, మత్తులోకి వెళ్లిన తర్వాత కాళ్ల గొలుసులు, చేతి కడియాలు తీసుకుని కత్తితో చెవులు కోశాడు. ఆమె మేలుకోవడంతో కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. నిందితుడు దూపం బుగ్గప్ప తాను చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడని, అప్పులు కావడంతో వస్తువులను అమ్మి తీర్చాలనుకున్నట్లు నిందితుడి భార్య పద్మ తెలిపిందన్నారు. పద్మ, దూపం బుగ్గప్పను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఇద్దరికి గాయాలు

ధరూరు : రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం మండల కేంద్రంలోని వైన్‌షాప్ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధిలోని దోర్నాల గ్రామానికి చెందిన నర్సింహులు, ధరూరుకు చెందిన సవారన్న ఇద్దరు బైక్‌పై వస్తుండగా, మాల్‌దొడ్డి వైపు నుంచి యువకుడు బైక్‌పై స్పీడ్‌గా వచ్చి ఢీకొట్టాడు. దీంతో నర్సింహులు తలకు తీవ్ర గాయాలు కాగా, మాల్‌దొడ్డి యువకుడికి కాలు విరిగింది. ఇద్దరిని వెంటనే గద్వాల ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నర్సింహులును మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. మాల్‌దొడ్డి గ్రామానికి చెందిన యువకుడికి కాలు విరిగింది. ఆ యువకుడిని గద్వాలకు తరలించారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

- గ్రామంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ పర్యటన


గండేడ్‌లో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ భాస్కర్

గండేడ్: డెంగీ ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ భాస్కర్ అన్నారు. బుధవారం గండేడ్ మండల పరిధిలోని కప్లాపూర్‌లో ఆయన పర్యటించారు. డెంగీ బాధితుల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోమల వ్యాప్తి చెందకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు ఫాగింగ్, బ్లీచింగ్‌తో పాటు మురుగు కాల్వల్లో , గుంటల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటా సర్వే పూర్తి చేసి అనారోగ్యంగా ఉన్న వారికి వైద్య సేవలు అందించాలన్నారు. మరో రెండురోజులు వైద్య సిబ్బందిని గ్రామంలోనే ఉంచాలని వైద్యాధికారి చంద్రశేఖర్‌కు సూచించారు. డెంగీతో పాటు న్యూమోనియా కేసులు, వైరల్ ఫీవర్ కేసులు ఉన్నట్లు వైద్యాధికారి డిప్యూటీ డీఎంహెచ్ఓకు వివరించారు. అనంతరం గండేడ్ ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి రమేష్, వైద్యాధికారి సునీల్, సీహెచ్ఓ రాములు, సూపర్‌వైజర్లు, ఏఎస్ఎంలు, ఆశ వర్కర్లు కప్లాపూర్‌లో వైద్య సేవలు అందిస్తున్నారు.

ప్రజలు, ఆర్టీసీకి వారధిలా పనిచేయాలి


మాట్లాడుతున్న సీటీఎం జీవన్‌ప్రసాద్

- చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జీవన్‌ప్రసాద్
- ఆర్టీసీ వీబీఓలకు శిక్షణ

స్టేషన్ మహబూబ్‌నగర్: విలేజ్ బస్ ఆఫీసర్లు ప్రజలకు, ఆర్టీసీకి వారధిలా పనిచేయాలని ఆర్టీసీ ప్రధాన కార్యాలయం చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జీవన్ ప్రసాద్ సూచించారు. జిల్లా కేంద్రం బస్టాండ్‌లోని కన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ సేవలను మరింత చేరువకావడానికి విలేజ్ బస్ ఆఫీసర్లను ఏర్పాటు చేశామన్నారు. ఆర్టీసీ సేవలు, పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. రీజినల్ మేనేజర్ శ్రీదేవి వీబీఓలకు సలహాలు, సూచనలు అందజేశారు. వీబీఓలు ఉద్యోగ విధులు నిర్వహిస్తూనే గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. శాఖాపూర్ సర్పంచ్ జయన్నగౌడ్ మాట్లాడుతూ.. వీబీఓలకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. అదే విధంగా పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ రాధాకృష్ణ నైపుణ్యాభివృద్ధిపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు బాబునాయక్, శ్యామల, డిపోల మేనేజర్లు రాజశేఖర్, రాజేశ్వర్, సుజాత, ఉష తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రకాల్లో నాణ్యమైన విత్తనాలు


ఫౌండేషన్ సీడ్ ట్యాగ్


సర్టిఫైడ్ సీడ్ ట్యాగ్

అలంపూర్: నాణ్యమైన విత్తనాలు సాగుచేస్తే ఏ పంటలోనైనా అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ పేర్కొన్నారు. నాణ్యమైన విత్తనాలు నాలుగు రకాల్లో లభ్యమవుతాయని రైతులకు సూచిస్తున్నారు. బ్రీడర్, సర్టిఫైడ్, ట్రూత్ ఫుల్, లేబుల్స్‌లో లభిస్తాయని పేర్కొంటున్నారు. ఇందులో ఏ రకాన్ని సాగు చేసినా విత్తనంగా మార్చుకోవచ్చని, వీటితో రైతులు విత్తనభారం తగ్గించుకోవడంతో పాటు తోటి రైతులకు అందించి అధిక ధర పొందవచ్చని వివరించారు.

బ్రీడర్ విత్తనం..

ఇది అన్నిరకాల విత్తనాలకు మూల విత్తనం. దీన్ని కంపెనీలు ఆయా బ్రీడర్ల పర్యవేక్షణలో పండిస్తారు. వ్యవసాయ పరిశోధన స్థానాల్లో శాస్త్రవేత్తలు తయారు చేసేది ఇలాంటి విత్తనాలే. ఈ విత్తనం వందశాతం జన్యు నాణ్యత కలిగి ఉంటుంది. బ్రీడర్ సీడ్‌కు బంగారురంగు ట్యాగ్ వేస్తారు. సీడ్ ధర ఎక్కువ. రైతులకు రెండు కిలోలకు మించి ఇవ్వరు.

ఫౌండేషన్ విత్తనం..

ఈ విత్తనాన్ని బ్రీడర్ విత్తనం నుంచి ఉత్పత్తి చేస్తారు. వివిధ విత్తనోత్పత్తి సంస్థలు, సాంకేతిక నిపుణుల ఆధ్వర్యంలో పండిస్తారు. దాదాపు వంద శాతం జన్యు నాణ్యత ఉంటుంది. ప్రైవేటు విత్తన కంపెనీలు వ్యవసాయ పరిశోధన స్థానాల నుంచి బ్రీడర్ విత్తనాలు తీసుకెళ్లి ఫౌండేషన్ విత్తనాన్ని తయారు చేస్తాయి. ఈ సీడ్‌కు తెలుపు రంగు ట్యాగ్ వేస్తారు.

సర్టిఫైడ్ (ధ్రువీకరించిన) విత్తనం..

దీన్ని ఫౌండేషన్ విత్తనం నుంచి వేరుగా ఉత్పత్తి చేస్తారు. వివిధ సంస్థలు, రైతుల పొలాల్లో కూడా విత్తన పర్యవేక్షకుల సమక్షంలో పండించే అవకాశం ఉంటుంది. ఈ విత్తనానికి నీలిరంగు ట్యాగ్ వేస్తారు.

ట్రూత్‌ఫుల్ లేబుల్ విత్తనం..

సర్టిఫైడ్ విత్తనం నుంచి ఉత్పత్తి చేసిన ఈ విత్తనాన్ని విత్తన ధ్రువీకరణ సంస్థ ధ్రువీకరించాల్సి ఉంటుంది. అనంతరం ఆ విత్తనాలను ట్రూత్ ఫుల్ లేబుల్ కింద రైతులకు విక్రయిస్తారు. ఈ విత్తనానికి ఆకుపచ్చరంగు ట్యాగ్ వేస్తారు.

లేబుల్ ట్యాగ్‌పై ఉండే వివరాలు..

విత్తన పరీక్ష చేయబడిన తేదీ, ఆ తేదీ నుంచి 9నెలల కాలపరిమితిలోపు విత్తనాన్ని కొనుగోలు చేయవచ్చు.

వీటిని గమనించండి..

- కనీస మొలక శాతం, కనీస జన్యు స్వచ్ఛత, గరిష్ఠ తేమశాతం తదితర వివరాలు చూసుకున్న తర్వాతనే విత్తనాలుకొనుగోలు చేయాలి.
- విత్తన సంచిపై లేబుల్ లేకున్నా, సరిగ్గా సీల్ లేకున్నా, విత్తనాలు కొనవద్దు.
- తేమ అధికంగా ఉన్న చోట, మిర్చి విత్తనాల దగ్గర, సిమెంట్, క్రిమి సంహారక మందులు, ఎరువుల సంచుల వద్ద, సూర్యరశ్మి తగిలే ప్రాంతాల్లో నిల్వచేసిన విత్తనాలు కొనుగోలు చేయవద్దు.
- అడ్వాన్స్‌గా విత్తనాలు బుకింగ్ చేయవద్దు.
- రాత్రికి రాత్రి విక్రయించే అపరిచిత వ్యక్తుల నుంచి విత్తనాలు కొనరాదు. అనుమానం వస్తే ఆయా వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి.


సర్టిఫైడ్ సీడ్ విత్తనాలు

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

అచ్చంపేట: మండలంలోని కిష్యాతండాకు చెందిన కేతావత్ భాస్కర్ మనస్తాపంతో మంగళవారం రాత్రి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సిద్దాపూర్ ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొంతకాలంగా రెండు వర్గాల మధ్య భూవివాదం కొనసాగుతుంది. కూతురి పెళ్లి ఉండడంతో భూమి తిరిగి వస్తుందో రాదోనని ఆలోచించి ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. భార్య కేతావత్ మండ్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో చిన్నారి కిడ్నాప్

- మేనత్తే సూత్రధారి

జడ్చర్ల: పట్టణంలో ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారిని సొంత మేనత్త మరో వ్యక్తితో కలిసి కిడ్నాప్ చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన భాగ్యమ్మ, ఉత్తరయ్యల కుమార్తె శైలజ పాఠశాల ప్రాంగణంలో ఆడుకుంటుండగా, ఇదే కాలనీలో నివాసం ఉంటున్న చిన్నారి మేనత్త అంజలి మరో వ్యక్తి సైదులుతో కలిసి బైక్‌పై కిడ్నాప్ చేశారు. కూతురిని కిడ్నాప్ చేశారన్న సమాచారంతో తల్లిదండ్రులు వెంటనే సోషల్‌మీడియాలో సమాచారం పెట్టి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. తమను పోలీసులు వెతుకున్నారని భావించిన నిందితులు చిన్నారిని విడిచిపెట్టడంతో క్షేమంగా ఇంటికి చేరుకుంది. కుటుంబ కక్షల కారణంగానే సొంత మేనత్త కిడ్నాప్‌కు యత్నించిందని సీఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

తెయూలో మరోసారి విజిలెన్స్ విచారణ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం మరోసారి విచారణ జరిపారు. ఉదయం 11.30 గంటలకు క్యాంపస్‌కు చేరుకున్న అధికారులు సాయంత్రం 5.30 గంటల వరకు ఇద్దరు మాజీ రిజిస్ట్రార్లతో పాటు మరో 8 మందిని తెయూ పరిపాలనా భవనంలోని ఎగ్జిక్యూటివ్ హాల్‌లో సుదీర్ఘంగా విచారించారు. వీసీ ప్రొఫెసర్ డి.రవీం దర్‌గుప్తా అక్రమాలకు సహకరించారని ఆరోపణలున్న మాజీ ఇంచార్జి రిజిస్ట్రార్లు ప్రొఫెసర్ కనకయ్య, ప్రొఫెసర్ విద్యావర్ధినితో పాటు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎం.అరుణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు సాయాగౌడ్, విజయలక్ష్మి, సూపరింటెండెంట్ భాస్కర్ (అకౌంట్ సెక్షన్), అసిస్టెంట్ ఇంజనీర్ వినోద్, సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కవిత తోరణ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ శాంతాబాయిలను విజిలెన్స్ అధికారులు విచారించారు. వీసీ చేసిన అక్రమ పదోన్నతులు, నియామకాలు, విచ్చలవిడి కొనుగోళ్లు, చెల్లింపులు, నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. ప్రభుత్వ ఆదేశాల మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జూన్ 6న మొదటిసారి దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే.

ఎంసీసీ కంపెనీ ఆస్తుల అటాచ్‌మెంట్

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని మంచిర్యాల సిమెంటు కంపెనీ(ఎంసీసీ) ఆస్తులను టీఎస్ఎన్‌పీడీసీఎల్ అధికారులు బుధవారం అటాచ్‌మెంట్ చేసుకున్నారు. టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ శేషారావు, డీఈఈ కైసర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిమెంట్ కంపెనీ రూ.10.30 కోట్లు విద్యుత్ బిల్లులు బకాయి పడింది. పలుమార్లు నోటీసులు జారీ చేసినా యాజమాన్యం స్పందించలేదు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం తెలంగాణ రెవెన్యూ రికవరీ యాక్టు 1864 ప్రకారం కంపెనీలోని యంత్రపరికరాలు, భవనాలతోపాటు 184 ఎకరాల 28 గుంటల భూమిని స్థానిక తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, ఎన్‌పీడీసీఎల్ తహసీల్దార్ ప్రసాదరావులు ఎంసీసీ అధికారుల సమక్షంలో అటాచ్‌మెంట్ చేశారు. కాగా, ఎంసీసీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు ముఖేష్‌గౌడ్ మాట్లాడుతూ.. కంపెనీకి చెందిన విలువైన ఆస్తులను యాజమాన్యం ఇప్పటికే అమ్ముకుందని, కంపెనీ మూసివేసి కార్మికులకు అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎంసీసీ ఆస్తులను స్వాధీనం చేసుకుని, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

ఇంటిదొంగ 'ఈశ్వరన్' ఔట్

అవినీతి ఊబిలో చంద్రబాబు సింగపూర్ స్నేహితుడు

- 'సీపీఐబీ' విచారణకు ఆదేశించిన సింగపూర్ ప్రధాని
- రవాణా శాఖ మంత్రిగా తొలగింపు
- ఈశ్వరన్‌ను ముందుపెట్టి బాబు అంతర్జాతీయ డ్రామా
- ఏకంగా సింగపూర్ ప్రభుత్వంతోనే ఒప్పందం కుదుర్చుకున్నట్లుగా ప్రచారం
- అమరావతి స్టార్టప్ ఏరియాలో రూ.లక్ష కోట్ల దోపిడీకి స్కెచ్


తన స్నేహితుడైన సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌ను సత్కరిస్తున్న చంద్రబాబు(ఫైల్)

సాక్షి, అమరావతి: పీకల్లోతు అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన సింగపూర్ సీనియర్ మంత్రి, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు స్నేహితుడు ఎస్.ఈశ్వరన్‌పై అక్కడి అత్యున్నత దర్యాప్తు సంస్థ సీపీఐబీ (కరప్ట్ ప్రాక్టీసెస్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో) విచారణ ప్రారంభించింది. సింగపూర్ రవాణా శాఖ మంత్రిగా ఉన్న ఎస్.ఈశ్వరన్ తీసుకున్న నిర్ణయాల వల్ల దేశానికి భారీ ఎత్తున నష్టం వాటిల్లినట్లు సీపీఐబీ గుర్తించింది. అత్యంత తీవ్రమైన అవినీతికి పాల్పడిన మంత్రి ఈశ్వరన్‌ను విచారించేందుకు అనుమతి ఇవ్వాలని సింగపూర్ ప్రధాని లీని సీపీఐబీ డైరెక్టర్ డెనిస్ టాంగ్ ఈనెల 5వతేదీన కోరారు. దీనిపై తక్షణమే స్పందించిన సింగపూర్ ప్రధాని ఈనెల 6న అనుమతి ఇచ్చారు. ఈనెల 11న సీపీఐబీ విచారణ ప్రారంభించడంతో ఈశ్వరన్‌ను తాజాగా మంత్రి పదవి నుంచి సింగపూర్ ప్రధాని తప్పించారు.

అమరావతి పేరుతో అంతర్జాతీయ నాటకం..

రాష్ట్ర విభజన నేపథ్యంలో 2014 ఎన్నికల్లో కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాటి సంక్షోభాన్ని అవకాశంగా మల్చుకుని సింగపూర్ ప్రభుత్వ సహకారంతో దేవతల రాజధాని అమరావతిని తలదన్నే రీతిలో నూతన నగరాన్ని నిర్మిస్తానంటూ నమ్మబలికారు. రాజధానిని ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారనే అంశంపై వందిమాగధులకు లీకులిచ్చి భారీ ఎత్తున భూములను కాజేశారు. ఆ తర్వాత తాపీగా రాజధాని ప్రాంతాన్ని ప్రకటించారు. సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌ను ముందు పెట్టి గ్రాఫిక్స్ చూపిస్తూ అందరినీ మభ్యపుచ్చారు. ఈ క్రమంలో రాజధాని స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు ముసుగులో సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌తో కలిపి రూ.లక్ష కోట్లు స్వాహా చేసేందుకు స్కెచ్ వేశారు.

సింగపూర్ ప్రభుత్వంతోనే ఒప్పందం అన్నట్లుగా

రాజధానిలో 1,691 ఎకరాల్లో స్టార్టప్ ఏరియా ప్రాజెక్టుకు సంబంధించి స్విస్ చాలెంజ్ విధానాన్ని తుస్సుమనిపించి ఇతర కంపెనీలేవీ బిడ్లు దాఖలు చేయకుండా సింగపూర్ సంస్థలు అసెండాస్–సిన్‌బ్రిడ్జి–సెంబ్‌కార్ప్ కన్సార్టియంకి కట్టబెడుతూ 2017 మే 2న నాటి చంద్రబాబు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఆ సంస్థల కన్సార్టియంకు స్టార్టప్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రాజెక్టును అప్పగిస్తూ 2017 మే 12న ఈశ్వరన్‌తో చంద్రబాబు ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో రాజధాని నిర్మాణం కోసం ఏకంగా సింగపూర్ ప్రభుత్వంతోనే ఒప్పందం కుదుర్చుకున్నట్లు చంద్రబాబు ప్రచారం చేసుకున్నారు. ఆ ప్రాజెక్టులో పెట్టుబడి సహా మౌలిక సదుపాయాల కల్పనకు రూ.5,721.9 కోట్లు వెచ్చించే రాష్ట్ర ప్రభుత్వం వాటా 42 శాతం కాగా కేవలం రూ.306.4 కోట్లు పెట్టుబడి పెట్టే సింగపూర్ కంపెనీల కన్సార్టియం వాటా 58 శాతం కావడం గమనార్హం. కన్సార్టియం, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీ) కలిసి 15 ఏళ్లలో మూడు దశల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసి.. రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా గ్రాస్ టర్నోవర్‌లో మొదటి విడత 5 శాతం, రెండో విడత 7.5 శాతం, మూడో విడత 12 శాతం (సరాసరి 8.7%) ఆదాయం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తే సరిపోతుందని నాటి చంద్రబాబు కేబినెట్ అంగీకరించింది. ఈ ముసుగులో రూ.లక్ష కోట్లకుపైగా దోచుకోవడానికి స్కెచ్ వేశారు.

అక్రమాల ఒప్పందం రద్దు..

గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించడంతో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో అసెండాస్–సిన్‌బ్రిడ్జి–సెంబ్‌కార్ప్ కన్సార్టియంతో తమ ప్రభుత్వానికి సంబంధం లేదని సింగపూర్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో ఈ ఒప్పందం రద్దు అయింది.

54 వేల ఎకరాల భూ పంపిణీ

- రైతులుగా మారనున్న 46,935 మంది భూమి లేని నిరుపేదలు
- అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కుల కల్పన
- సీఆర్డీయే పరిధిలో 24న ఇళ్ల నిర్మాణ పనులకు గ్రీన్ సిగ్నల్
- దేవాలయాల్లో పనిచేసే అర్చకులకు నో రిటైర్మెంట్
- దేవాదాయ శాఖ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు
- ఏపీ సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నిరుపేదలు, అసైన్డ్, సర్వీస్ ఈనామ్, లంక భూముల రైతులకు భారీ మేలు చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. తద్వారా భూములకు సంబంధించి గతంలో ఏ ప్రభుత్వం చేయనంత మేలు రైతులకు చేకూరనుంది. ఈ నిర్ణయాలకు సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన బుధవారం తాత్కాలిక సచివాలయంలో నిర్వహించిన కేబినెట్ సమావేశంలో మంత్రి మండలి ఆమోదం తెలిపింది. దివంగత సీఎం వైఎస్సార్ తర్వాత మళ్లీ భూ పంపిణీకి సీఎం జగన్ సర్కార్ సిద్ధమైంది. 54,129.45 ఎకరాలను భూమిలేని దళిత, బడుగు బలహీన వర్గాలకు చెందిన 46,935 మంది నిరుపేదలకు పంపిణీకి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అసైన్డ్ భూముల రైతులకు యాజమాన్య హక్కులను కల్పించేందుకు ఆమోదం తెలిపింది. భూమిని ప్రభుత్వం కేటాయించి (అసైన్ చేసి) 20 ఏళ్లు పూర్తయిన అనంతరం ఆ భూమిపై సంబంధిత రైతులు, వారి వారసులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది. దీంతో పట్టా భూముల రైతుల మాదిరిగానే అసైన్డ్ భూముల క్రయ, విక్రయాలకు అవకాశం ఏర్పడుతుంది. ప్రభుత్వం వాస్తవంగా ఎవరికైతే భూమిని కేటాయించిందో వారికి యాజమాన్య హక్కు దక్కుతుంది. వారు లేని పక్షంలో వారి వారసులకు హక్కులు రానున్నాయి. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలో దాదాపు 22 లక్షల మంది బడుగు, బలహీన వర్గాల వారికి ప్రయోజనం చేకూరనుంది. ఇంకా మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాల గురించి సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మీడియాకు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఆ కుల వృత్తుల వారికి శుభవార్త

మూడు కేటగిరీల్లోని 9,062 ఎకరాల లంక భూముల రైతులకు డీ పట్టాలు ఇవ్వడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. కొన్ని భూములను ఐదేళ్ల లీజు ఇవ్వడానికి అనుమతించారు. ఈ నిర్ణయంతో 19,176 మంది రైతులకు మేలు చేకూరునుంది. పేదలకు భూ పంపిణీ, లంక భూములకు డీ పట్టాలు ఇవ్వడం ద్వారా మొత్తంగా 63,191 ఎకరాలకు సంబంధించి 66,111 మందికి లబ్ధి చేకూరనుంది. గ్రామాల్లో కుల వృత్తులు చేసుకునే వారికి ఇచ్చిన సర్వీస్ ఈనామ్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. కుమ్మరి, రజక, కమ్మరి, నాయీబ్రాహ్మణ తదితర కుల వృత్తులు చేసుకునే వారికి గతంలో ఈనామ్‌గా ఇచ్చిన భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. వీటిని ఇప్పుడు ఆ జాబితా నుంచి తొలగింపు ద్వారా వారికి సర్వ హక్కులు కల్పించనున్నారు. 1,68,603.71 ఎకరాల భూములు నిషేధిత జాబితా(22ఏ) నుంచి తొలగించడం ద్వారా 1,13,610 మందికి ప్రయోజనం కలుగనుంది. 2013కు ముందే వీరందరూ రైత్వారీ పట్టాలు పొందారు. ఆ తర్వాత ఈ భూములపై ఆంక్షలను విధించారు. ఇప్పుడీ ఆంక్షలన్నీ తొలగిపోనున్నాయి. దేవాలయాల్లో పని చేస్తున్న అర్చకులు ఓపిక, శక్తి ఉన్నంత వరకు భగవంతుడి సేవలో కొనసాగేలా రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అర్చకులకు రిటైర్మెంట్ లేకుండా చట్ట సవరణ చేసేందుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. మరోవైపు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే దేవదాయ శాఖ ఉద్యోగులకు కూడా ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచేందుకు నిర్ణయించింది. 2024–25 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో కొత్తగా ఐదు వైద్య కళాశాలలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. పులివెందుల, పాడేరు, ఆదోని మెడికల్ కాలేజీలకు గత మంత్రివర్గ సమావేశంలో పోస్టులు మంజూరు చేశారు. మిగిలిన రెండు చోట్ల.. మదనపల్లి, మార్కాపురం వైద్య కళాశాలలు ప్రారంభించడానికి వీలుగా కళాశాలకు 222, బోధనాస్పత్రికి 484 చొప్పున 1,412 పోస్టుల సృష్టికి కేబినెట్ ఆమోదం తెలిపింది

నల్ల'మార్గ'ం ఉక్కిరిబిక్కిరి..!

▶ మొదటి పేజీ తరువాయి

జాతీయ బ్యాంకులు, కేంద్ర ఆర్థిక సంస్థల్లో కాకుండా మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో దాచడం సాధారణ అంశం కాదని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. జాతీయ బ్యాంకులు సేవింగ్స్ ఖాతాలపై 5 శాతం కంటే అధికంగా వడ్డీ చెల్లిస్తున్నాయి. మార్గదర్శి కేవలం 5 శాతం వడ్డీనే చెల్లించడం, అదికూడా ఓ రశీదు జారీ చేసి సరిపుచ్చుతున్నా భారీగా డిపాజిట్లు చేయడం వెనుక పెద్ద మతలబే ఉన్నట్లు స్పష్టమవుతోంది. జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ చేయాలంటే ఆ ఆదాయం ఎలా వచ్చిందో చెప్పాలి. పాన్, ఆధార్ నంబర్ ఇతర వివరాలను సమర్పించాలి. ఆర్బీఐ, ఆదాయపన్ను, సీబీడీటీ అధికారుల దృష్టిలో పడుతుంది. ఆ వివరాలేవీ వెల్లడించేందుకు సుముఖంగా లేనివారు మాత్రమే ఇతర సంస్థల్లో డిపాజిట్ చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. ఎందుకంటే వారు డిపాజిట్ చేసేదంతా నల్లధనమే కాబట్టి.

ఇదే తరహా మోసంలో సహారా చైర్మన్‌కు జైలు శిక్ష

బడాబాబుల నల్లధనాన్ని గుట్టుచప్పుడు కాకుండా దాచేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ ఓ వేదికగా మారిందన్న వాదనకు తాజా పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి. అక్రమ డిపాజిట్ల ద్వారా భారీగా నల్లధనాన్ని చలామణిలోకి తెస్తున్నట్లు స్పష్టమవుతోంది. గతంలోనూ మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట రామోజీరావు ఇలాంటి వ్యవహారాలనే సాగించినట్లు ఆర్థిక నిపుణులు గుర్తు చేస్తున్నారు. అక్రమ డిపాజిట్లు సేకరించిన సహారా పరివార్ లాంటి సంస్థలు తమ డిపాజిట్‌దారుల వివరాలను గోప్యంగా ఉంచటాన్ని ప్రస్తావిస్తున్నారు. సహారా ఇండియా అక్రమ డిపాజిట్ల వ్యవహారం గుట్టు రట్టు కావడంతో సంస్థ చైర్మన్ సుబ్రతోరాయ్‌కు న్యాయస్థానం జైలు శిక్ష విధించడం గమనార్హం. ఈ నేపథ్యంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అక్రమ డిపాజిట్‌దారులకు సీఐడీ నోటీసులు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

బుకాయించబోయి దొరికిన రామోజీ

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో రూ.కోటి కంటే ఎక్కువ మొత్తం డిపాజిట్ చేసిన వారికి సీఐడీ నోటీసులు జారీ చేయడంతో ఈ కేసులో ఏ–1గా ఉన్న సంస్థ చైర్మన్ రామోజీరావు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. తమ డిపాజిట్‌దారులకు నోటీసులు జారీ చేయడాన్ని ఖండిస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఓ పత్రికా ప్రకటన జారీ చేసింది. తాము చిట్‌ఫండ్స్ చట్టం, ఆదాయపన్ను చట్టాన్ని సక్రమంగా పాటిస్తున్నట్లు అందులో పేర్కొంది. అయితే ఆర్బీఐ, సీబీడీటీ నిబంధనలను పాటిస్తున్నట్లు ఎక్కడా పేర్కొనకపోవడం గమనార్హం. చిట్‌ఫండ్ సంస్థలు డిపాజిట్లు సేకరించడాన్ని ఆర్బీఐ అనుమతించడంలేదు. డిపాజిట్ల సేకరణపై సీబీడీటీ కింద పన్నులు చెల్లించాలి. అలా చెల్లించినట్లు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎక్కడా చెప్పడం లేదు. ఆ విషయాన్ని కప్పిపుచ్చేందుకే ఆదాయపన్ను చట్టాన్ని పాటిస్తున్నట్లు మభ్యపుచ్చుతున్నట్లు స్పష్టమవుతోంది.

నలమల టోల్‌గేట్‌లో ఫాస్టాగ్ సేవలు



మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్ దుర్వాసుల చెరువు, దోమలపెంట వద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌లో ఫాస్టాగ్ సేవలు ప్రారంభించినట్లు మన్ననూర్ ఎఫ్ఆర్ఓ ఈశ్వర్ తెలిపారు. అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో పర్యావరణ పరిరక్షణ నిర్వాహణను దృష్టిలో ఉంచుకొని ఎన్‌హెచ్ 765 రహదారిలో అటవీశాఖ ఆధ్వర్యంలో టోల్‌గేట్ ఏర్పాటు చేసిన విషయం విదితమే. వాహనదారులకు నగదు చెల్లింపులో ఇబ్బందులు ఏర్పడకుండా ఫాస్టాగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టోల్‌గేట్ రుసుం మోటరు వాహనాలకు రూ.50, భారీ వాహనాలకు రూ.80 వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఫాస్టాగ్ ట్రాయల్ రన్ నాలుగో రోజు నిర్వహించినట్లు తెలిపారు. త్వరలోనే అధికారికంగా ఫాస్టాగ్ సేవలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

మ్యాచ్‌కు వర్షం అడ్డంకి

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో జరుగుతున్న హెచ్‌సీఏ బి–డివిజన్ రెండు రోజుల లీగ్ మ్యాచ్‌కు వర్షం అడ్డంకిగా మారింది. డెక్కన్ అర్సలన్ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి 326 పరుగులకు ఆలౌట్ అయింది. రెండోరోజు బుధవారం 47/1 ఓవర్‌నైట్ స్కోర్‌తో 327 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాలమూరు జట్టు 46 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసి పటిష్టస్థితిలో ఉండగా.. వర్షం అంతరాయం కలిగించడంతో మ్యాచ్‌ను నిలిపివేశారు. జట్టులో అబ్దుల్ రాఫే 79, డేవిడ్ క్రిపాల్ 41 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. సమయం ముగిసేసరికి వర్షం ఆగకపోవడంతో డ్రాగా ప్రకటించి ఇరు జట్లకు చెరో మూడు పాయింట్లు ఇచ్చారు.

రేషన్ బియ్యం పట్టివేత

వెల్దండ : మండల పరిధిలోని కేస్లీతండాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవికుమార్ ఆధ్వర్యంలో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని వ్యాపారిని అదుపులోకి తీసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. తుమ్మలకుంట తండాకు చెందిన రామావత్ భీమ్లానాయక్ అనే వ్యాపారి గ్రామాల్లో తిరుగుతూ రేషన్ బియ్యాన్ని సేకరించి ఇతర ప్రాంతాలకు తరలించేవాడు. కేస్లీతండాలో రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నట్లు పక్క సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవికుమార్ పోలీసులతో వెళ్లి పట్టుకున్నాడు. బొలేరోలో 15 క్వింటాల రేషన్ బియ్యం సేకరించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

98 జీఓ నిర్వాసితులకు.. కొలువులొచ్చేనా!


గతంలో ముంపునకు గురైన మంచాలకట్ట గ్రామం

- ఏళ్లు గడుస్తున్నా.. ఎదురుచూపులే..
- ప్రభుత్వాలు మారినా.. పట్టించుకోని పాలకులు

ముంపునకు గురైన వివరాలు	
ముంపుకు గురైన గ్రామాలు 67	నిర్వాసిత కుటుంబాలు 11191
కోల్పోయిన భూములు 120000 ఎకరాలు	

పెంట్లవెల్లి: గతంలో శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం కోసం దాదాపు 67 గ్రామాలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డాయి. అప్పట్లో నిర్వాసితులకు 98, 68 జీఓలను సవరించి ప్రత్యేకంగా ఉద్యోగాలు, నష్టపరిహారం కల్పిస్తామని పాలకులు హామీ ఇచ్చారు. ఇంటికో ఉద్యోగం, భూములు, ఇండ్లు కోల్పోయిన వారికి నష్ట పరిహారం ఇప్పిస్తామని అప్పటి ప్రభుత్వాలు ఈ జీఓలు తీసుకొచ్చాయి. నాలుగు దశాబ్దాలు గడిచినా నిర్వాసితులకు పూర్తి స్థాయిలో ఉద్యోగాలు కల్పించలేదు. రాష్ట్రాలు విడిపోయి ప్రభుత్వాలు మారుతున్నా తమకు న్యాయం జరగడం లేదని నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెంట్లవెల్లి, చిన్నంబావి, కొల్లాపూర్ మండలాల్లో శ్రీశైలం నిర్వాసితులు వందల కుటుంబాలున్నాయి. పాలకులు మారిన ప్రతిసారీ ఉద్యోగాలు వస్తాయనే ఆశతోనే ఎదురుచూస్తామని, తమకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు స్థానిక ఎమ్మెల్యేలు హామీల వర్షం కురిపిస్తారు తప్పా.. గెలిచాక పట్టించుకునే వారే కరువయ్యారు. నాటి నుంచి నేటి వరకు 163 మందికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. వచ్చిరాని జీతాలతో వారు విధులు నిర్వహిస్తున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 30 మందికి, కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో 128 మందికి ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగావకాలు కల్పించారు. ఆ తరువాత ఉద్యోగాల ఊసే లేదు. వందలాది నిర్వాసితుల కుటుంబాలు ఉద్యోగాలొస్తాయనే ఆశతో ఉన్నారు. పెంట్లవెల్లి మండలంలోని జటప్రోలు, మంచాలకట్ట, చెల్లపాడు, మల్లేశ్వరం, మాధవస్వామినగర్, యంగంపల్లి తండా ప్రజలు కోరుతున్నారు. ఈ ఎన్నికల ముందైనా నిర్వాసితుల గురించి రాజకీయ నాయకులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, ఇంటికో ఉద్యోగం ఇప్పించి బాధితులను ఆదుకోవాని కోరుతున్నారు.

సర్వం కోల్పోయాం..



శ్రీశైలం ప్రాజెక్టులో ఇండ్లు, పొలాలు పూర్తిగా కోల్పోయాం. మాకు ఎంతో అన్యాయం జరిగింది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మాకు ఉద్యోగాలు ఇవ్వాలి.
– బాలరాజు, మంచాలకట్ట

ఉద్యోగంపైనే ఆశలు..



మాకున్న ఆస్తులు మొత్తం పూర్తిస్థాయిలో శ్రీశైలం ప్రాజెక్టులో ముంపునకు గురయ్యాయి. అప్పటి ప్రభుత్వం 98 జీవో ప్రకారం ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగం వస్తదనే ఆశలు పెట్టుకొని బతుకుతున్నాం. ఎమ్మెల్యే చొరవ తీసుకొని ఉద్యోగాలిప్పించి న్యాయం చేయాలి.
– కుర్మయ్య, మాధవస్వామినగర్

సీపీఎస్ రద్దుకు పోరాటం


పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన సీపీఎస్ ఉద్యోగుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాత పింఛన్ సాధన కోసం సంకల్ప రథయాత్ర ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ నెల 16న అలంపూర్‌లో యాత్ర ప్రారంభమై ఈ నెల 31న ముగుస్తుందన్నారు. యాత్రను విజయవంతం చేసేందుకు ఆయా శాఖల ఉద్యోగులను కలిసి ప్రచారం చేస్తున్నట్లు వివరించారు. ఆగష్టు 12న చలో హైదరాబాద్ కార్యక్రమం ఉంటుందన్నారు. తమ పోరాటానికి వివిధ ఉద్యోగ సంఘాలు మద్దతు తెలుపుతున్నాయని వివరించారు. అనంతరం పాత పింఛన్ సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. జెడ్పీ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి, జిల్లా ప్రధానకార్యదర్శి చంద్రకాంత్, కోశాధికారి రాఘవేంద్ర, విజయ్‌కుమార్, యాదగిరి, ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి, షంషీర్, ధనుంజయ్ పాల్గొన్నారు.

నిలకడగా ఉల్లి ధరలు

దేవరకద్ర: పట్టణంలో బుధవారం ఉల్లి విక్రయాలు జోరుగా సాగాయి. మార్కెట్‌కు సెలవు కావడంతో రైతులు నేరుగా ఉల్లి విక్రయాలు సాగించారు. 45 కిలోల సంచి రూ.900కు విక్రయించారు. ఉల్లి వేలం నిర్వహించకున్నా ధరలు మాత్రం నిలకడగానే కొనసాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులే వ్యాపారులుగా మారి ఉల్లిని అమ్ముకున్నారు.


ఉల్లిని బస్తాల్లో నింపుతున్న రైతులు

యాదాద్రి తరహాలో 'జోగుళాంబ'

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్ టీఎస్‌టీడీసీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్
- ప్రసాద్‌స్కీం పనుల పరిశీలన


జోగుళాంబ ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ వల్లూరి క్రాంతి తదితరులు

జోగుళాంబ శక్తిపీఠం/అలంపూర్ రూరల్: రాష్ట్రంలో ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయాలను ప్రభుత్వం యాదాద్రి తరహాలో అభివృద్ధి చేయనుందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం టూరిజం శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, టీఎస్‌టీడీసీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యేలు అబ్రహం, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయులుగౌడ్, వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య, ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి వివిధ రూపాలలో సుమారు రూ.40వేల కోట్ల వాటాలో భాగంగా మన రాష్ట్రానికి సగబాగం వస్తుందన్నారు. అందులో ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం వివిధ పథకాలకు ఉపయోగిస్తుండగా సీఎం కేసీఆర్ అందులో నుంచి ఆలయాల అభివృద్ధికి కూడా ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ సారి ఏ ఆలయాభివృద్ధికి నిధులు కేటాయించాలనే ప్రస్తావన వచ్చినప్పుడు సీఎం కేసీఆర్ అలంపూర్ జోగుళాంబ శక్తిపీఠాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చే యాలనే సంకల్పాన్ని కనబరిచారన్నారు.

ప్రసాద్ స్కీం పనుల పరిశీలన

కేంద్ర పర్యాట శాఖ నుంచి రాష్ట్రానికి వచ్చిన ప్రసాద్ స్కీం పనులలో భాగంగా రూ.37 కోట్లతో చేపడుతున్న భవన నిర్మాణ పనులను వారు పరిశీలించారు. హెడ్ ఆఫీస్ ఎస్ఈ సరిత, సంయుద్దీన్, డీఈ ధన్‌రాజు పనులకు సంబంధించిన మాస్టర్‌ప్లాన్‌ను మంత్రికి వివరించారు. ప్రస్తుతం రూ.18కోట్ల50 లక్షలు మంజూరు కాగా ఇందులో రూ.16కోట్ల70 లక్షల పనులు పూర్తి చేశామని మంత్రికి చెప్పారు. మంత్రి మాట్లాడుతూ బస్టాండ్ వద్ద ఒక ఆర్చిగేట్ నిర్మించాలని, ఆలయానికి చేరు మార్గంలో ఈ ప్రాంత విశిష్టతను తెలియజేసే కట్టడాలు, పేయింటింగ్స్‌తో పర్యాటకులను ఆకర్షించే విధంగా ఉండాలన్నారు. అతి పురాతనమైన యోగ నారసింహ స్వామి ఆలయాన్ని పునరుద్ధరణకు సంబంధిత శాఖలతో మాట్లాడి నివేదిక సిద్ధం చేయాలన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- 4వ రోజు పాదయాత్రలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి


పాదయాత్ర చేపడుతున్న అనిరుధ్‌రెడ్డి

నవాబుపేట: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని టీపీసీసీ ప్రధానకార్యదర్శి అనిరుధ్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో కొనసాగుతున్న ప్రజాహిత పాదయాత్రలో భాగంగా మండల కేంద్రంలో మాట్లాడారు. రైతు రుణమాఫీ, దళితులకు 3 ఎకరాల భూమి, నిరుద్యోగ భృతి తదితర వాటిని వెంటనే అమలు పరచాలన్నారు. రెండు పడకల ఇళ్లు ఇంకా ప్రజలకు అందకుండానే శిథిలమైపోతున్నాయని, వాటిలో ప్రజలు ఉండే పరిస్థితి లేకుండా వాటి నిర్మాణం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులకు సొంత వ్యాపారంపై ఉన్న శ్రద్ధ ప్రజల అభ్యున్నతిపై లేదని ఆరోపించారు. చెరువుల్లో మట్టి విషయంలో సంబంధిత అధికారితో కలిసి వస్తే జడ్చర్ల ఎమ్మెల్యేతో చర్చకు తాను ఎక్కడైనా సిద్ధంగా ఉన్నానని ఆయన సవాల్ విసిరారు. గ్రామాల్లో వివిధ రకాల పనులు చేసిన సర్పంచ్‌లకు ప్రభుత్వం నిధులు విడదల చేయకపోవటం సబబు కాదని, వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. సర్పంచ్‌లే సర్కార్‌పై నిరాశతో ఉంటే, ఇక ప్రజల పరిస్థితి అర్థం అవుతుందన్నారు.

50 కిలోమీటర్లకు చేరిన పాదయాత్ర

ప్రజాహిత పాదయాత్ర మండలంలో 4వ రోజు 50 కిలోమీటర్లకు చేరింది. ఆయన మండలంలో 20 గ్రామాలను పాదయాత్రలో పర్యటించి పలు సమస్యలు తెలుసుకున్నారు. పార్టీ శ్రేణులు మండల కేంద్రంలో గజమాలతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు రంగారావు, అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి, రబ్బాని, వాసుయాదవ్, నర్సింహచారి, నర్సింహులు, ఆంజనేయులు, మల్లేష్, నవాజ్‌రెడ్డి, కుమార్, మీనాక్షి, జ్యోతి, సురేందర్, రామోదర్ తదితరులు పాల్గొన్నారు.